సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్కీం వర్కర్లు అయిన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, విఓఎలు, ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులు, వారిపై రాజకీయ వేధింపులు, దాడులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అరికట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ స్కీం వర్కర్లపై ఇటీవల దాడులు పెరిగిపోయాయని అన్నారు. గత ప్రభుత్వంకార్మికులను ఇబ్బంది పెట్టడం వల్లే ప్రజలకు దూరమైందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి వేధింపులకు పాల్పడటం అన్యాయంగా ఉందన్నారు. గ్రామాల్లో దాడులు పెరిగిపోవడంతో కార్మికులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. స్కీం వర్కర్ల దాడులు అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు మొదటి వారంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా చారిత్రాత్మకమైన పోరాటం 42 రోజుల సమ్మె అనుభవాల మీద రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి, జిల్లా కోశాధికారి జమున, నాయకులు కాత్యాయని, గోవిందమ్మ, రాధమ్మ, అరుణ, మేరీ, శ్రీదేవి, విజయమ్మ, జ్యోతి, గోవిందమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ అక్రమ దందాపై చర్యలుండేనా..?

- గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా కొనసాగిన రవాణా...
- చర్యలు తీసుకోవాలంటున్న అధికారపార్టీ నేతలు
- ప్రస్తుత ప్రభుత్వ చర్యలు ఎలా ఉంటాయన్నదానిపై చర్చ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటక సరిహద్దుల నుంచి అనంతపురం జిల్లాలోకి డీజల్ అక్రమ రవాణా దందా జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది.అనేక మార్లు పట్టుబడిన దాఖలాలూ ఉన్నాయి. ఇప్పుడు ఆ రకంగా దొంగ వ్యాపారం చేసిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని అధికార టిడిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటీవల బాహటంగానే ఆరోపించడమే కాకుండా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తన నియోజకవర్గం పరిధిలో ఒక పెట్రోల్ బంకులో రోజుకు 40 వేల వరకు అక్రమంగా కర్నాటక నుంచి తెచ్చిన డీజల్ అమ్మకం ద్వారా కొంత మంది సొమ్ము చేసుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం గమనార్హం. గతంలో ప్రతిపక్షంలో ఉండగానే రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కూడా ఇదే రకమైన ఆరోపణలు చేశారు. జిల్లాలోకి కర్నాటక నుంచి డీజల్ అక్రమ రవాణా దందా సాగుతోందని ఆరోపించారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం డీజల్ అక్రమ దందాపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటుందా అన్న చర్చ నడుస్తోంది.

ధర వ్యత్యాసంతో లక్ష లీటర్లకుపైగా అక్రమంగా వ్యాపారం

ఆంధ్రప్రదేశ్‌కు కర్నాటకకు డీజల్ ధరలో లీటరుపై రూ.11.25 ధర వ్యత్యాసం ఉంది. దీంతో అక్కడి నుంచి ఇక్కడికి తీసుకు వచ్చి అమ్ముకోవడం ద్వారా లీటరుపై రూ.11.25లు మిగులుంటుంది. నిబంధనల ప్రకారం పక్క రాష్ట్రం నుంచి పెద్ద మొత్తంలో డీజల్ తీసుకొని వచ్చి బయట అమ్మడానికి వీల్లేదు. ఎందుకంటే ఈ రకంగా అమ్మడం ద్వారా ఇక్కడ ప్రభుత్వానికి పన్ను రూపంలో రావాల్సిన ఆదాయం రాకుండా పోతుంది. ఈ రకంగా అమ్మిన వారిపై వాణిజ్య పన్నుల శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాని గడిచిన మూడునాలుగేళ్లుగా ఏకంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీనే కోట్ల రూపాయల్లో అక్రమంగా దిగుమతి అయిన డీజల్ కొనుగోలు చేసింది. అది అప్పటి అధికారపార్టీ నేతల ప్రమేయంతోనే సాగింది. కాని వాణిజ్య పన్నుల శాఖగాని, ఇతర అధికారులుగాని ఏ మాత్రం చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఒకటి,రెండు కేసులు మాత్రమే నమోదు చేసిన ఘటనలున్నాయి. ఒక దగ్గర రూ.30 లక్షల వరకు జరిమానా విధించారు. పుట్లూరు మండలంలో నేరుగా వాహనాలనూ పట్టుబడిన దాఖలాలున్నాయి.

ప్రభుత్వం చర్యలు తీసుకునేనా ?

ప్రభుత్వం డీజల్ వ్యాపారంలో భాగస్వామ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని జెసి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేయడమే కాకుండా ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై విచారణ కొనసాగుతుందా లేక ఫిర్యాదుతోనే ముగుస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

అవినీతి డీలర్లపై చర్యలు తీసుకోవాలి

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అవినీతికి పాల్పడిన ఎఫ్‌పి షాపుల మీద చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం అనంతపురం నగరంలోని రామ్‌నగర్ మంత్రి నివాసంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం అవినీతికి పాల్పడిన ఎఫ్‌పి షాపులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ శోభారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అధికారులతో మంత్రి సమావేశం

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో అభివద్ధి పనులు, ఆర్టీసీ బస్సుల కండిషన్, ఇతర అభివద్ధి కార్యక్రమాలపై ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని, బస్సులను కండిషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్, డీఈ సురేంద్రబాబు, డిపో మేనేజర్ నాగభూపాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిఎస్‌ఒ శోభారాణితో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ట్యాంకు కడగరు..శుద్ధజలం అందించరు..

మూతబడిన పసులూరులోని సుజలస్రవంతి వాటర్‌ప్లాంట్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

'మంచినీరు అందించే గ్రామంలోని ట్యాంకు కడగరు.. శుద్ధినీరు అందించరూ.. అదేనీరు తాగలేక సుమారు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి..' ఇదీ మండలంలోని పుసలూరు గ్రామంలో పరిస్థితి... వివరాల్లోకి వెళ్తే... జిల్లాకేంద్రానికి అతి సమీపంలో ఉండే బుక్కరాయసముద్రం మండలం పసలూరు గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం నానా తిప్పలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో మురికి నీరు.. పురుగులు, వ్యర్థాలు పడిన నీటిని తాగలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు ఎన్‌టిఆర్ సుజలస్రవంతి వాటర్ ప్లాంట్‌ను తెరిచే నాథుడే లేకుండా పోయాడు.

తాగునీటి కోసం పసలూరు వాసుల తిప్పలు

గ్రామంలోని నాయకులు ఒకరిపై మరొకరు పేరు చెప్పుకుంటూ తాగునీటిని వదలకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెలరోజులు కావస్తున్నా తాగునీటి గురించి పట్టించుకునే నాథులే లేకుండా పోయాడు. చేసేది లేక సుమారు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి బిందెలు, క్యాన్లతో నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి పసలూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్ఎస్ ట్యాంకుకు తుంగభద్ర నీరు పంపింగ్

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం పట్టణానికి తాగునీరు సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి తుంగభద్ర నీటిని పంపింగ్ చేసే కార్యక్రమాన్ని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప ఆదివారం కనేకల్ వద్ద ప్రారంభించారు. ఈసందర్భంగా తుంగభద్ర నీటిని ఎస్ఎస్ ట్యాంకులోకి పంపింగ్ చేసే మోటర్‌ను ఆన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజులుగా జిల్లాలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో తుంగభద్ర ప్రాజెక్టు ఎగువన నది పరివాహక ప్రాంతంలో విస్తృతంగా వర్షాలు కురవడంతో తుంగభద్ర ప్రాజెక్టు నిండిందన్నారు. రాయదుర్గం పట్టణ జనాభా 80వేల మంది అవసరాలకై 3050 ఎంఎల్‌డి నీటి సామర్థ్యం గల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిండేందుకు మూడు నెలలు పడుతుందన్నారు. తుంగభద్ర ఎగువ కాలవలో నీటి సరఫరా కొనసాగే వరకు నీటి పంపింగ్ జరుగుతుందన్నారు. అనంతరం వేసవిలో ట్యాంకులో ఉన్న నిల్వ నీటిని వాడుకోవచ్చు అన్నారు. నీటి పంపింగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే మునిసిపల్, విద్యుత్ అధికారులు సమన్వయంగా పనిచేసి పరిష్కరించాలన్నారు. సకాలంలో తుంగభద్ర జలాలు రావడం వల్ల జిల్లాలో తాగునీటి సమస్య తీరినట్లుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సురేష్, కోదండ, మున్సిపల్ వార్డు సభ్యులు జ్యోతి ప్రశాంతి, శ్రీలక్ష్మి, శారద, గోవిందరాజులు, లావణ్య, పద్మజ, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ వార్డు సభ్యులు టంకసాల హనుమంతు, ధనార్జన, పురుషోత్తం, భారతి, తదితరులు పాల్గొన్నారు.

నీటి పంపింగ్ గేట్‌వాల్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే , మున్సిపల్ ఛైర్‌పర్సన్, తదితరులు

సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం

ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ. వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై కలిసికట్టుగా పోరాడుదామని ఎపి ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఉద్యోగుల కార్మికుల పెన్షనర్ల ఐక్యవేదిక ఛైర్మన్ కె.ఆర్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి దిశానిర్దేశం లేకుండా ఏర్పాటు చేశారని తెలిపారు. సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న ఉద్యోగులను లీగలైజేషన్, సర్వీస్ రూల్స్, ఎలాంటి ప్రభుత్వ నిబంధనలను వర్తించకుండా నూతన విధానాలతో వారిని తీవ్ర నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల గౌరవప్రదమైన జీవన విధానానికి ప్రత్యేక దృష్టితో చూడాలని ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. తనను చంపడానికి కూడా గత ప్రభుత్వం వెనుకాడ లేదన్నారు. అన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని తాను బలంగా నిలబడి ఆనాటి ప్రభుత్వంతో పోరాటం చేశానన్నారు. సచివాలయ ఉద్యోగులు భవిష్యత్తు తరాలకు సంబంధించిన ఉద్యోగ శ్రామికులని కొనియాడారు. తాను పడ్డ కష్టం ఎవరికి రాకూడదనే ఉద్దేశ్యం ప్రతి ఒక్క ఉద్యోగి గౌరవాన్ని నిలబెట్టేందుకు తాను ముందుండి నడుపుతానని తెలిపారు. ఉద్యోగులకు నాయకుడికి ఉండాల్సిన భేదం కేవలం నమ్మకమే అని కొనియాడారు. సచివాలయ వ్యవస్థలో విధాన పరమైన అంశాలు అనేక అడ్డంకులు ఉన్నాయని వాటిని తొలగించేందుకు ప్రస్తుత ప్రభుత్వ మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నట్లు తెలియజేశారు. వాటిని తొలగించేందుకు ప్రభుత్వ పెద్దలు కూడా తమకు సంపూర్ణ అవకాశాన్ని కల్పిస్తామని సచివాలయ వ్యవస్థలో సమూలమైన మార్పులను తీసుకువచ్చి ప్రజల భాగస్వామ్యం చేస్తామని వారు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏ ఒక్క శాఖకు సంబంధం లేకుండా అనేక శాఖలతో ఏర్పాటు చేయడం ద్వారా వీటికి ఎలాంటి విధి వధానాలు లేకుండా రూపొందించడం ద్వారా 12 శాఖల అధికారులు సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న ఉద్యోగులపై తమ పెత్తనాన్ని చలాయిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామునాయక్, పుట్టపర్తి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ట్రెజరర్ నాగరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సాంబశివమ్మ, అనంతపురం నగర ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, నాగార్జున, నగర ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ సుధాకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెఆర్.సూర్యనారాయణ

పసికందు అదృశ్యం

3 గంటల్లోనే కేసు ఛేదింపు-పోలీసులకు చిన్నారి తల్లిదండ్రుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అదృశ్యమైన ఐదురోజుల పసికందు కేసును అనంతపురం పోలీసులు కేవలం మూడు గంటల్లోనే ఛేదించారు. వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత ఈనెల 16న అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాన్పు కోసం చేరింది. 23న ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆసుపత్రిలోని గైనిక్ విభాగంలో తల్లి, చిన్నారి ఉంటూ వైద్యసేవలు తీసుకుంటున్నారు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4-30 గంటల సమయంలో పసికందు అదృశ్యమైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. సమస్య ఎస్పీ కెవి.మురళీకృష్ణ దృష్టికి వెళ్లడంతో చాలా సీరియస్‌గా తీసుకుని వెంటనే ఛేదించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, టూటౌన్, 4వ పట్టణ సిఐలు క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి, అవుట్ పోస్టు ఏఎస్ఐ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డును దిగ్బంధనం చేసి అనుమానితులపై విచారణ చేపట్టారు. అంతేకాకుండా సీసీ పుటేజీలను పరిశీలించగా ఏ.నారాయణపురానికి చెందిన ఆమని అనే మహిళ సదరు పసికందును అపహరించినట్లు గుర్తించారు. వెంటనే ఆమె నుంచి చిన్నారిని స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులు అమృత, అనిల్‌కుమార్‌కు అప్పగించారు. దీంతో పసికందు అదృశ్యం ఘటన ఛేదింపుతో కథ సుఖాంతమైంది. ఎస్పీ, అనంతపురం డీఎస్పీ, సిఐలు, అవుట్ పోస్టు పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పసికందును తల్లికి అప్పగించేందుకు తీసుకెళ్తున్న డీఎస్పీ ప్రతాప్

అర్హత లేని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

మంత్రికి విన్నవించిన వైద్యులు

ప్రజాశక్తి అనంతపురం

సరైన విద్యార్హతలు లేకుండా అలోపతి వైద్యం చేస్తున్న వైద్యులపైనా, ప్రజారోగ్యానికి ప్రజల ప్రాణాలకు నష్టం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యులు డాక్టర్ రమణ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు ఐఎంఎ సభ్యులు ఆదివారం అనంతపురంలో మంత్రి సత్యకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో నెలకొన్న సమస్యలను ప్రక్షాళన చేయాలన్నారు. అర్హత లేని వారిపై తగిన చర్యలు తీసుకొని వైద్య ఆరోగ్య రంగాన్ని కాపాడాలని కోరారు. ఆర్టికల్ 20, భారత రాజ్యాంగం ప్రకారం, ఒక వ్యక్తిని శిక్షించాలంటే చట్ట ప్రకారమే శిక్షించాలన్నారు. చట్టాలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1968 చట్టంలో అర్హత లేని అలోపతి వైద్యులను నిషేధించారన్నారు. అయితే నిషేధాన్ని ఇప్పటివరకు అమలులోకి తీసుకురాలేదన్నారు. రాష్ట్రమంతటా ఎక్కడ చూసినా క్లినిక్‌లు ఉన్నాయన్నారు. క్లినిక్ మీద డాక్టర్ పేరు ఉంటుందే కానీ, డాక్టర్ పేరు వెనకాల ప్రభుత్వం నిర్దేశించిన డిగ్రీ ఉండదన్నారు. ప్రభుత్వ మెడికల్ కౌన్సిల్ లేదా బోర్డులో రిజిస్ట్రేషన్ నంబర్ ఉండదన్నారు. వాళ్లందరినీ నియంత్రించాలంటే గుర్తింపు లేని వైద్య వ్యవస్థలకు సంబంధించిన వైద్యులను చట్టం ద్వారా నిషేధించాలన్నారు. శిక్షను నాలుగు సంవత్సరాలుగా ఖరారు చేయాలన్నారు. అలా డిగ్రీలు లేకుండా ప్రాక్టీస్ చేసే వారి మీద పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టే హక్కును ప్రజలకు కల్పించాలన్నారు. స్పందించిన మంత్రి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు డాక్టర్ అభిషేక్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ధ్యేయం

ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో బాలల హక్కులు, మహిళాభివృద్ధి, పౌష్టికాహారం సరఫరా విషయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అన్ని చర్యలు చేపడుతోందని ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి వివరాలు ?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో 2207 మెయిన్ అంగన్వాడీ, 617 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు 1,05,447 మంది, 23,441 మంది గర్భిణులు, బాలింతలకు కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ప్రతినెలా అందిస్తున్నాం.

ప్ర : పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : జిల్లా వ్యాప్తంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం నెల నెల సక్రమంగా అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంపిణీ విషయంలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎవరైనా లబ్ధిదారుల నుండి పౌష్టికాహారం అందించడం లేదనిఫిర్యాదులు అందితే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తపై అభియోగాలు వస్తే తొలుత మెమోలు జారీ చేసి అనంతరం వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర : అంగన్వాడీ కార్యకర్తలపై వస్తున్న రాజకీయ వత్తిళ్లపై మీ అభిప్రాయం ?

జ : ఇటీవల జిల్లాలో కొన్నిచోట్ల అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ ఒత్తిళ్లువస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది రాజకీయ నాయకులు తెలియనితనంతో అంగన్వాడీ కార్యకర్తలను ,ఆయాలని తొలగించాలని సంబంధిత అధికారులకు ఒత్తిళ్లు తెస్తున్నారు. అయితే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను తొలగించే ఆస్కారం లేదు. వారి విధులు సక్రమంగా నిర్వహించక పోయినా పౌష్టికాహారం అందించడంలో అలసత్వం వహించినా, సక్రమంగా అందించలేదని ఫిర్యాదులు వచ్చినా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అంతేకానీ అనవసరంగా రాజకీయ నాయకుల ప్రోద్బలంతో వారిని ఇబ్బందులకు గురి చెయ్యం.

ప్ర : జిల్లాలో అంగన్వాడి కేంద్రాలను ఆధునీకరిస్తారా?

జ : జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఇదివరకే కొన్నింటిని ఆధునీకరించాం. గత ప్రభుత్వంలో సొంతభవనాలు లేని వాటికి నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటిలో కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించేందుకు, కేంద్రాలను మరమ్మతులు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించి, కేంద్రాలు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి

రైతులకు విద్యుత్ సమస్యలు రానివ్వొద్దు

ట్రాన్స్‌కో ఎస్ఇతో ఎమ్మెల్యే పరిటాల సునీత

ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు

పంటలు సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ సమస్యలు రానివ్వకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఇని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యుత్ శాఖ ఎస్ఇ సంపత్‌కుమార్ అదివారం పరిటాల సునీతతో క్యాంపు కార్యాలయంలో మరద్యాపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు. వ్యవసాయానికి అందే విద్యుత్ లో ఎలాంటి అవాంతరాలు కలగకూడదన్నారు. మరోవైపు కొన్ని కాలనీల్లో వీధి దీపాల సమస్య ఉందని, కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చి వాటిని పరిష్కరించాలన్నారు. ఇందుకు ఎస్ఇ స్పందిస్తూ సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా చాలా మంది అధికారులు, అనధికారులు, ప్రజలు ఎమ్మెల్యే సునీతను కలిశారు.

డాక్టర్ నారాయణప్ప సేవలు మరువలేనివి

డాక్టర్ నారాయణప్పకు నివాళులర్పిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

సైన్యంలో డాక్టర్‌గా విశేష సేవలు అందించిన డాక్టర్ నారాయణప్ప సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఆదివారం నగరంలోని మాసినేని గ్రాండ్‌లో నారాయణప్ప సంస్మరణ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నారాయణప్ప డాక్టర్‌గా యుద్ధ సమయాల్లో సైనికులకు అనేకవిధాలుగా సేవ చేశారన్నారు. సైన్యం నుంచి తిరిగి వచ్చిన తర్వాత కూడా అనంతపురంలో తాత క్లినిక్‌ని ఏర్పాటు చేసి అనేకమంది పేదలకు తక్కువ ధరతో వైద్యం అందించారన్నారు. ఆయన మరణం తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణప్ప భార్య పార్వతమ్మ, కూతుళ్లు మీనా, రీనా, సైనిక జిల్లా సంక్షేమాధికారి తిమ్మప్ప, సైనిక సంఘం మాజీ అధ్యక్షులు కెప్టెన్ షేకన్న, గౌరవాధ్యక్షులు వికె.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, తలమర్ల కృష్ణ, రామ్‌గోపాల్, బి.ఎ.హుస్సేన్, వై.ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, నాగరాజు, ఖాజా మొయిద్దీన్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్ల సంఖ్య పెంచుతాం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-నార్పల

ట్యాంకర్ల సంఖ్యను పెంచి నీటి సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో నెలకొన్న నీటి ఎద్దడిపై 'ఎమ్మెల్యే శ్రావణిశ్రీ గారు.. నెలకొన్న నీటి సమస్యపై స్పందించండి' అంటూ ప్రచురితమైన ప్రజాశక్తి వార్తకు ఎట్టకేలకూ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా సర్పంచి సుప్రియ, కార్యదర్శి అశ్వర్థనాయుడు మాట్లాడుతూ నార్పలలో నీరు రాని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు 9 ట్రిప్పులు సరఫరా చేఉత్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని పెంచుతామని తెలిపారు. అదేవిధంగా గతంలో దుగుమర్రి చెరువు నుంచి నార్పల సంపు వరకూ ఏర్పాటు చేసిన పైపులైన్‌ను మరోసారి పరిశీలించి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జిల్లా అండర్-7 బాలికల చెస్ ఎంపిక పోటీలు

చెస్ ఆడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-అనంతపురం

ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్ దగ్గర ఉన్న ఆర్‌కె చెస్ అకాడమీలో జిల్లా అండర్-7 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్-2024 ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలు చిన్నారుల ఎత్తుకు పై ఎత్తులతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. బాలుర విభాగంలో నాలుగు రౌండ్లు, బాలికల విభాగంలో మూడు రౌండ్లు పోటీలు స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహించినట్లు టోర్నమెంట్ డైరెక్టర్ కిషోర్‌కుమార్, చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున తెలిపారు. అండర్-07 ఓపెన్ విభాగంలో ఈశ్వర్‌ప్రసాద్.వి 4/4 పాయింట్లు, బాలికల విభాగంలో కాశిశమిక 3/3 పాయింట్లతో విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వీరందరూ విజయనగరంలో ఆగస్టు 3, 4వతేదీల్లో రాష్ట్ర అండర్-07 పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఆర్డీటీ క్రికెట్ టోర్నీ రన్నర్స్ 'అనంత విద్యానికేతన్'

రన్నరప్ ట్రోఫీతో అనంత విద్యానికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫాదర్‌ఫెర్రర్ క్రికెట్ టోర్నీలో మండల కేంద్రం సమీపంలోని అనంత విద్యానికేతన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంత విద్యానికేతన్, వాణీ స్కూల్ జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన అనంత విద్యానికేతన్ విద్యార్థులు నిర్ణీత 15 ఓవర్లలో 56 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వాణి స్కూల్ విద్యార్థులు 57 పరుగుల సాధించి గెలుపొందారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అనంత విద్యానికేతన్ ఆటగాడు జగన్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవాస్తవ, వినయ్, కోచ్ వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

9న మండల సమావేశం

వజ్రకరూరు : ఉరవకొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చేనెల 9న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సుబ్బరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కచ్చితంగా హాజరుకావాలని కోరారు.

వైభవంగా బోనాల ఉత్సవం

గుంతకల్లు : పట్టణంలోని పాత గుంతకల్లు నాగప్ప కాలనీలో వెలసిన త్రిపుర సుందరీదేవి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కాలనీలోని అంకాలమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు బోనాల ఎత్తుకుని త్రిపుర సుందరీదేవి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రధాన బోనాన్ని అమ్మవారికి సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవాల నిర్వాహకులు లక్ష్మీనారాయణ, నీలకంఠ, సత్యనారాయణ, ఎం.ప్రమేష్‌బాబు, రవికుమార్, వెంకటేశులు, భాస్కర్, శివస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి సత్యకుమార్‌యాదవ్

విలేకరులతో మాట్లాడున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బాచుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బాటసుంకలమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేయటంలో సీఎం చంద్రబాబు శక్తివంచన లేకుండా లేకుండా కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక భారం ఉన్నప్పటికీ సామాజిక భద్రత పింఛన్లను పెంచి ఇస్తున్నామన్నారు. పేదల కడుపు నింపడానికి అన్నా క్యాంటీన్లు, యువతకు తోడ్పాటు అందించేందుకు స్కిల్డ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే ప్రధాని మోడీ ఇచ్చిన మాట ప్రకారం తొలి బడ్జెట్‌లోనే అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతికి రింగ్ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారని చెప్పారు. గత అసమర్థ జగన్ పాలనలా కాకుండా తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, తెలుగు యువత నాయకుడు ఎన్.సుధాకర్ నాయకుడు, నంద్యాల రంగారెడ్డి యాదవ్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ ప్రారంభం

పట్టణంలోని విరుపాక్షరెడ్డి కన్వర్షన్ హాలులో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాసులు సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్, ఫ్రీజర్ బాక్స్ సర్వీస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తిలో డయాలసిస్, రక్తనిధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు.

లఘుచిత్రాలతో సామాజిక సందేశం

అవార్డు పొందిన 'ఆర్టీఐ' లఘు చిత్ర బృందానికి సత్కారం

లఘు చిత్ర బృందాన్ని సత్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

లఘు చిత్రాల ద్వారా సామాజిక సందేశం అందించడం అభినందనీయమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది ఎస్.అబ్దుల్‌రసూల్ కొనియాడారు. అనంతపురం కళాకారులు రూపొందించిన 'ఆర్టీఐ' ద పవర్ ఆఫ్ కామన్ మ్యాన్ లఘు చిత్రం ఇటీవల హైదరాబాద్‌లోని దాశరథి ఫిలిం ఇన్స్టిట్యూట్ బెస్ట్ షార్ట్ ఫిలిం అవార్డు పొందింది. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవ సంస్థ, ఎన్.కె.సి. సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్స్ హోంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముందుగా షార్ట్ ఫిలిమ్ ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు, వెనుకబడిన ప్రాంతమైన అనంతపురం జిల్లాలో రాష్ట్ర, జాతీయస్థాయి కళాకారులు ఉండడం గర్వకారణమన్నారు. పరిపాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారితనం కోసం 2005లో తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారన్నారు. ఇంత గొప్ప చట్టం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం గొప్పతనం గురించి ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా సందేశాత్మక లఘు చిత్రాన్ని రూపొందించిన చిత్ర బందాన్ని అభినందించారు. అనంతరం ఆర్టీఐ చిత్ర బృందం దర్శకుడు తరిమెల రాజు, నిర్మాత జంగం శ్రీనివాసులు, డిఓపి పవన్ లింగాల, నటీనటులు కె.పి.రాజు, పుష్ప, బి.సుధాకర్ రాజు, సాకే సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌కెసి సేవాసమితి వ్యవస్థాపకులు ఎన్.కమలనాథ్, ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.ప్రభాకర్, తెలుగు వెలుగు అధ్యక్షులు టివి.రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఫిల్మ్ సొసైటీ రషీద్‌బాషా, అనంతపురం మాస పత్రిక సంపాదకులు తోట నాగరాజు, బయపరెడ్డి, మధురశ్రీ, మస్థానప్ప పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకుంటేనే భవిష్యత్తు

ఎపిఎస్‌సిహెచ్ఇ మాజీ ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

అతిథులకు బహుమతిని బహూకరిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

నేటి యువత కళాశాల యాజమాన్యం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుంటేనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోగలరని ఎపిఎస్‌సిహెచ్ఇ మాజీ ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని శ్రీనివాస రామానుజన్ (ఎస్ఆర్ఐటి) కళాశాలలో ఆరంభ్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదవడానికి ఒక మంచి కళాశాలను ఎన్నుకుని చేరడంతోనే తమ బాధ్యత తీరిపోయిందనుకోకుండా, మొదటి రోజు నుంచే ప్రతి విషయాన్నీ నేర్చుకుంటూ ఉజ్వల భవితకు పునాదులు వేసుకోవాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లుకష్టపడి చదివితే... నాలుగు దశాబ్దాలు సుఖంగా జీవించవచ్చన్నారు. అంతేగాకుండా కళాశాల యాజమాన్యం, సిబ్బంది అందించే అద్భుత అవకాశాలను చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా సమయాన్ని వృథా చేయకుండా, చదివే అలవాటును పెంపొందించుకుంటూ, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. తమ విద్యార్జనలోని బలాలు, బలహీనతలు, అవకాశాలు, భయాలను అధిగమించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండంట్ ఆలూరు సాంబశివారెడ్డి, ఎస్ఆర్ఐటి సలహాదారు ఇఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, డీన్ సాయిచైతన్య కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ యు.శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన విధానం అవసరం

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత కాలంలో ఆరోగ్యకరమైన జీవన విధానం చాలా అవసరమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు సూచించారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జోనల్ 'సీఎంఇ కార్యక్రమం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక వైద్య విభాగం వారు జోనల్ సీఎంఇ నిర్వహించడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా వ్యాధుల నిర్మూలన చేస్తూ ప్రజలందరికీ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని నేర్పగలదన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరూలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సుధాకుమారి, జోనల్ డబ్ల్యూహెచ్వో సర్వలెన్స్ ఆఫీసర్ డాక్టర్ భవాని, తెలంగాణ డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మహేష్, అనంతపురం ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఇంటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి అడిషనల్ డీఎంఇ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, డాక్టర్ సరళ, రాయలసీమ జోన్‌లోని 150మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు.

గుత్తికోట కట్టడాలు అద్భుతం

ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలఫెర్రర్

గుత్తి కోటలో పర్యటిస్తున్న విశాలాఫెర్రర్

ప్రజాశక్తి-గుత్తి

చారిత్రాత్మక గుత్తి కోట కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం గుత్తి కోటను సందర్శించారు. ముందుగా జిల్లా మొట్టమొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రోసమాధిని సందర్శించారు. కోటలోని కట్టడాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటలోని కట్టడాలను అమోఘంగా నిర్మించారని చెప్పారు. ఆమెకు గుత్తి కోట చరిత్ర గల పుస్తకాన్ని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, కోటగైడ్ ఎం.రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కరిడికొండ సుధాకర్ నాయుడు, యువజన సమితి కన్వీనర్లు చిరంజీవి, హెచ్ఎం జిలాన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు హెచ్ఎం అర్షద్, నాయకులు శివ, బాషా, పురావస్తుశాఖ సిబ్బంది అమృత్, కృష్ణచైతన్య, ఆంజనేయులు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

సొంతూరులో ఎమ్మెల్యే 'దగ్గుపాటి' బిజీబిజీ

వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిత్యం రాజకీయాలు, వ్యాపారాలతో బిజీ బిజీగా ఉండే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం తన స్వగ్రామం రాప్తాడు మండలం బండమీదపల్లిలో ఎంతో సరదాగా గడిపారు. స్నేహితులతో ముచ్చట్లు, పెద్దలతో ఆశీర్వాదాలు, ప్రతి ఇంటా ఆప్యాయ పలకరింపుల మధ్య దగ్గుపాటి ప్రసాద్ కుటుంబ సభ్యులు గడిపారు. పలువురు ఆహ్వానం మేరకు స్వగ్రామానికి వెళ్లిన దగ్గుపాటి ఊరు మొత్తం తిరిగారు. తన తోటి స్నేహితులు, శ్రేయోభిలాషులు ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. గ్రామంలో ఉన్న తన వ్యవసాయ క్షేత్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. అనంతరం పలువురి ఇంటికి వెళ్లి కుశల సమాచారాలు తెలుసుకున్నారు. కొందరితో ఆశీర్వాదాలు తీసుకున్నారు. మరోవైపు ఇటీవల మరణించిన గ్రామ వాసి బోయ సూరి కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. ఒకప్పుడు ఎంపీపీగా ఉన్న దగ్గుపాటి ఇప్పుడు ఎమ్మెల్యే స్థాయికి వెళ్లడంపై గ్రామస్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. మంచి మనసు ఉన్న దగ్గుపాటికి మొదటి నుంచి అంతా మంచే జరుగుతోందని పలువురు చర్చించుకున్నారు.

మంత్రి 'పయ్యావుల'ను కలిసిన ఎస్పీ

మంత్రికి బొకే అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం : రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న మంత్రి నివాసంలో కలిసి పూలమొక్క అందజేశారు. తర్వాత శుభాకాంక్షలు తెలిపారు.

కురుబ సంఘం మండల కన్వీనర్‌గా నాగరాజు

బొమ్మనహాల్ : కురుబ సంఘం మండల కన్వీనర్‌గా నాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో కురుబ సంఘం జిల్లా కన్వీనర్ బోరంపల్లి రామాంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులుగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా లేపాక్షి, జనరల్ సెక్రటరీగా హొన్నూరుస్వామి, కోశాధికారిగా ఎర్రిస్వామిని ఎన్నుకున్నారు.

మంత్రిని కలిసిన డాక్టర్ రమణానాయక్

మంత్రికి బొకే అందజేస్తున్న డాక్టర్ రమణానాయక్

శింగనమల : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను జిల్లా కేంద్రంలో ఎపిజిడిఎ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జనరల్ సర్జన్ డాక్టర్ రమణానాయక్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి, పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని సోమనపల్లి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమనపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా వీరయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ

ఆత్మకూరు : రాష్ట్ర కురుబ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకులు పిల్లల వేణుగోపాల్ భార్య నారాయణమ్మ ఎ.ఆదెమ్మ (52) ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, ధర్మవరపు బాలాజీ, అనిల్‌కుమార్ చౌదరి, శశాంక్‌చౌదరి, రమేష్‌నాయుడు, నారాయణస్వామి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంహెచ్‌పిఎస్ అధ్యక్షులు మాదిగ గోపాల్, తదితరులు ఉన్నారు.

1 నుంచి జీపుజాతా

రాయదుర్గం : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1వతేదీ నుంచి తలపెట్టిన జీపుజాతను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం రాయదుర్గంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో పెండింగ్ కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలని, నూతన భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న జీపుజాతను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు అభిషేక్, మధు, భాను, జగన్, కార్తీక్, పవన్, రాందాస్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రజక నాయకులు

పల్లా శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రమేష్‌బాబు

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను టిడిపి అనంతపురం పార్లమెంట్ రజక సాధికార కమిటీ కన్వీనర్ సి.రమేష్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రాంత రజకులకు న్యాయం చేయాలని కోరారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్, ఛైర్మన్ పదవి రాయలసీమ ప్రాంత రజకులకు కల్పించాలని కోరారు. రజకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో రైతు గోవిందరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లికి చెందిన రైతు గోవిందరెడ్డి గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా కొత్తపేట గ్రామ శివారులోకి రాగానే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కోడిగుడ్ల లోడుతో వెళున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట జూదరుల అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ గౌస్‌మహమ్మద్

గార్లదిన్నె : మండల కేంద్రంలోని పెనకచర్ల రోడ్డులో ఉన్న ఓ చీనీ తోటలో ఆదివారం పేకాట ఆడుతున్న 10మందిని గార్లదిన్నె పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఎస్ఐ గౌస్‌మహమ్మద్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి పదిమందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4,17,700 నగదు, 20 ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు అందరూ బుక్కరాయసముద్రం, అనంతపురం రూరల్ మండలానికి చెందిన వారని ఎస్ఐ గౌస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గాయపడిన ఈశ్వరయ్య

బుక్కరాయసముద్రం : మండలంలోని వడియంపేట సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామిడి మండలం గజరాంపల్లికి చెందిన ఈశ్వరయ్య ద్విచక్ర వాహనంలో అనంతపురానికి వెళ్తుండగా వడియంపేట మలుపు వద్దకు రాగానే అనంతపురం వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఈశ్వరయ్యకు ఈశ్వరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.